క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): సూరంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సూరంపల్లి, రామచంద్రపాలెం, మాదలవారి గూడెం, చనుపల్లివారి గూడెం గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం

పెనమలూరు:పోరంకి వాసవి క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా గంగూరు విజయ విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. క్లబ్ జోన్ చైర్‌పర్సన్ లక్ష్మి దుర్గ, అధ్యక్షుడు వెంకటమస్తాన్, కార్యదర్శి హారిక, ట్రెజరర్ శెట్టి శైలజ, క్లబ్ సభ్యులు భక్తులకు పులిహోర, కేసరి, తాగునీరు అందచేశారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



రామవరప్పాడు: మహాశివరాత్రి పురస్కరించుకుని విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జననీ థెరిస్సా సేవా సంస్థ ఆధ్వర్యంలో సుమారు 150 మంది వృద్ధులకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షురాలు బోయిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, అనాథలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ సెక్రటరీ అద్దేపల్లి సాంబశివనాగరాజు, సభ్యులు కోడెబోయిన రాధాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం ఎంతో మేలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు, రోగ నిరోధక శక్తి పెరుగుదలకు భారతీయ సనాతన వైద్య విధానమైన ఆయుర్వేదం ఎంతో మేలు అని ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు. బాపులపాడు మండలం పెరికీడులో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్, కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ కె.వాహిని నేతృత్వంలో డాక్టర్ కె.సునీత, డాక్టర్ మాళీ నాయక్, డాక్టర్ మురళీబాబు సేవలు అందించారు. సుమారు 530 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మోకాళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, గ్యాస్ ట్రబుల్, అరికాళ్ల తిమ్మిర్లు వంటి సమస్యలకు పాటించాల్సిన ఆయుర్వేద వైద్య విధానాన్ని, పంచకర్మ వైద్యం ప్రయోజనాలను డాక్టర్ వాహిని వివరించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్షుడు కాకుల సుబ్బారావు, కార్యదర్శి మాకినేని శ్రీనివాసరావు, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం స్వామి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ కనకదుర్గా నృత్య మందిర్‌కు చెందిన ఎంఎన్ఎస్.భార్గవి, జె.కనిష్క, బి.నయోనిక, పి.జ్ఞానసమన్విత, డి.ఉన్మేష, కె.కావ్యలతో పాటు మరి కొంత మంది తమ నృత్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

హర హర మహాదేవ.. శంభో శంకర

- శివగిరిపై ఉత్సవ శోభ
- కనుల పండువగా స్వామివారి కల్యాణం
- ఆకట్టుకున్న ప్రభోత్సవం
- పోటెత్తిన భక్తులు

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల సందడితో శివగిరి పై ఉత్సవ శోభ ఏర్పడింది. మహాశివరాత్రి పర్వదినంతో వేకువజామునే కొండపై వేంచేసి ఉన్న స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి పితృదేవతలకు పిండ ప్రదానం చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకం చేశారు. స్వామివారికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ఆలయంలో నవగ్రహాలు, విఘ్నేశ్వరుడు, హనుమంతుడు, నాగేంద్రస్వామి ,ఇతర దేవతామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఉచితంగా ప్రసాదం, మజ్జిగ, స్వచ్ఛమైన ఉచిత తాగునీరు అందచేశారు. వృద్ధులు, వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. మొక్కులు తీరిన భక్తులు తల పై గండ దీపం పెట్టుకుని నేల పై చీరలు పరిచి కొండ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గండదీపంతో స్వామివారి మొక్కులు సమర్పించారు. స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

సందడిగా ప్రభోత్సవం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రభోత్సవం ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు రాతిచక్రాల రథం పై ఏర్పాటు చేసిన దేవుడి ప్రభ కొండ చుట్టూ తిప్పారు. గ్రామంలో దాదాపు 50 ప్రభలు రంగురంగు కాగితాలు, విద్యుద్దీపాలతో అలంకరించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. దేవుడి ప్రభతో పాటు గ్రామంలో మిగతా ప్రభలు డప్పులు కొడుతూ ఊరేగించారు. రాధాకృష్ణ కోలాటం, కోయ, భేతాళ నృత్యాలు, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి భక్తులను ఉత్సాహ పరిచారు. గ్రామంలో ప్రభలు రాత్రి పొద్దుపోయే వరకు తిరిగాయి.



గన్నవరంలో ఆది దంపతులకు కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

చోడవరం, పోరంకి, కానూరు, తాడిగడప, పెదపులిపాక శివాలయాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

కృష్ణానదిలో పుణ్య స్నానాలు....

పెదపులిపాక ఘాట్ వద్ద భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. మహిళలకు జల్లు స్నానాలు చేయటానికి గ్రామ పంచాయతీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. యనమలకుదురు శివలింగాల ఘాట్ వద్దకు భక్తులు తరలివెళ్లారు. చోడవరం ఏటిపాయలోనూ భక్తులు పుణ్య స్నానాలు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గన్నవరం:మహాశివరాత్రి పర్వదిన వేడుకను పురస్కరించుకుని నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు శనివారం శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆది దంపతులకు శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ, రాత్రి 12.01 గంటలకు స్వామివారికి లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేసరపల్లి శివారు గుమ్మడి నాగేంద్రక్షేత్రంలో సోమలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కేసరపల్లిలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, దావాజిగూడెంలోని శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిపారు.

ముక్తేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తొలుత శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహించారు. శాంతి కల్యాణం వైభవంగా చేశారు. మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు కొల్లిమర్ల రంగారావు, నందూరి సత్య వెంకటేశ్వర శర్మ, నక్కా బాబు, మెరుగుమాల వేణు, పుట్టి వీర్రాజు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చినకంచిలో మహాశివరాత్రి పూజలు

నున్న(విజయవాడరూరల్):మహాశివరాత్రి సందర్భంగా శనివారం నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచి భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు స్వామివారికి అభిషేకాలు చేశారు. శనిత్రియోదశి కావడంతో భక్తులు తైలాభిషేకాలు చేశారు. శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. చినకంచిలో ప్రతిష్ఠించిన ఏకాంబరనాథ స్వామికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అలానే చండీహోమం నిర్వహించారు. అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, గంగాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. విఘ్నేశ్వర, మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, దశశాంతులు, సామ్రాజ్య పట్టాభిషేకం, నీరాజ మంత్రపుష్పం చేశారు. భక్తులు శివపార్వతులను దర్శించుకొని ఆశీస్సులు పొందారు. పాతపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. పి.నైనవరం గ్రామం, అంబాపురం గ్రామాల్లో మహా శివరాత్రి పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

కంకిపాడు: శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం వేకువజాము నుంచే మండలంలోని పలు గ్రామాల్లో గల శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పరమశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి తరించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, మంతెన, ఉప్పలూరు, నెప్పల్లి, ప్రొద్దుటూరు, గొడవర్రు తదితర గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. ఓం నమఃశివాయ అంటూ భక్తులు స్వామిని పూజించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లోని ధ్యానయోగసాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ పాతూరి జ్ఞానేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో అరుణ పారాయణం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా శివలాంగాకృతి, సాయినాధుడి మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గాయత్రీ విహార్ భక్త బృందం పూజలు పర్యవేక్షించింది.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి

ఉంగుటూరు:మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తేలప్రోలు గంగా పార్వతి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పండితులు సోమశేఖర సుందర శర్మ ఆధ్వర్యంలో ధర్మకర్తలు వింత శ్రీనివాసరెడ్డి, వాణి దంపతులు శివపార్వతుల కల్యాణం చేశారు. ఇందుపల్లి, మానికొండ, పెద అవుటపల్లి, ఆత్కూరు, ఉంగుటూరు తదితర గ్రామాల్లో శివరాత్రి పండుగ ఘనంగా చేశారు.

గన్నవరం రూరల్: చిక్కవరంలోని బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నే లక్ష్మణరావు(నల్లబాబు), కవిత దంపతుల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముస్తాబాదలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు భాస్కర శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పలువురు ప్రముఖులు పూజలు చేశారు.

ఉయ్యూరు: పట్టణంలోని జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద ఓగిరాల, చిన ఓగిరాల, ఆకునూరు, ముదునూరు, కాటూరు శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. మండలంతో పాటు పట్టణానికి చెందిన ప్రజలు తోట్లవల్లూరు మండలంలోని ఐలూరు కృష్ణానదిపాయలో స్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండ ప్రదానాలు సమర్పించారు.

మద్దూరు ఏటిపాయకు పోటెత్తిన భక్తజనం

కంకిపాడు:మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మద్దూరు ఏటిపాయకు భక్తజనం పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండ ప్రదానాలు సమర్పించారు. అనంతరం పండితులు, పేదలకు దానాలు ఇచ్చారు. ఏటి ఒడ్డున ఉన్న శివ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఉన్న శివలింగాకృతికి స్వయంగా పువ్వులు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు పరిసర గ్రామాల నుంచి సుమారు 40 వేల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అంచనా. ఏటిపాయ వద్ద పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనులను పంచాయతీ పాలకవర్గం, అధికారులు పర్యవేక్షించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పడవలు, 10 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ఏటిపాయ వద్ద ఏర్పాట్లను తహసీల్దార్ టీవీ సతీష్ శనివారం సమీక్షించారు. సర్పంచ్ చిప్పల రామదాసు, ఈఓ కిరణ్‌కుమార్, రెవిన్యూ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు.



ఐస్‌తో తయారు చేసిన విగ్రహం



ఐస్‌తో మహా శివుడి విగ్రహాలు

పెనమలూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివలింగాన్ని ఐస్‌తో రూపొందించి ఏర్పాటు చేయటంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు. యనమలకుదురు రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శివలింగం, విఘ్నేశ్వరుడిని ఐస్‌తో తయారు చేసి ఆలయ ప్రాంగణంలో ఉంచారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు. అదే విధంగా పోరంకిలో అద్దేపల్లి చందు అనే భక్తుడు వేణుగోపాలస్వామివారి ఆలయం వద్ద ఐస్‌తో శివలింగాన్ని, శివుడి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు.

కనులపండుగగా స్వామివారి కల్యాణం...

రామలింగేశ్వరస్వామివారి దివ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని మండపంలో మావులూరి రాజశేఖర్, చారులతాదేవి పుణ్యదంపతులచే ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరసాగర్ స్వామివారికల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. నేడు గ్రామంలో గ్రామోత్సవం జరుపుతారు.

పెనమలూరు:హరహర మహాదేవా.. శంభోశంకర.. అంటూ మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు శివాలయాలకు పోటెత్తారు. మండల పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వేకువజామునే స్వామిని దర్శించుకోవటానికి భక్తులు శివాలయాలకు తరలివచ్చారు. యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాదం, స్వచ్ఛమైన తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. మండల పరిధిలోని పెనమలూరు, కానూరు,



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

రామవరప్పాడు: మహాశివరాత్రిని పురస్కరించుకుని విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లోని శైవాలయాలు శనివారం శివనామ స్మరణతో మార్మోగాయి. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఆయా గ్రామాల్లో భక్తులు ఓం నమఃశివాయః శంభో శంకర అంటూ భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. రామవరప్పాడులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం చేశారు. అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. రాత్రి స్వామి వారికి శాంతి కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ భక్తులు స్వామి వారి దర్శనార్థం విశేషంగా తరలివచ్చారన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించామని తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆదివారం స్వామి వారికి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తామని వివరించారు.



రామవరప్పాడు రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ముక్తేశ్వర స్వామి



గాయత్రీవిహార్‌లో శివలింగం, సాయినాధుడు



మద్దూరు ఏటి ఒడ్డున శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



మద్దూరులో పితృదేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్న ప్రజలు



ఏటిపాయలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



యనమలకుదురులో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



పెదపులిపాక ఘాట్‌లో నదీ స్నానాలు చేస్తున్న భక్తులు



యనమలకుదురు ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు



భక్తులకు ఎల్‌జీ సంస్థ అందిస్తున్న తాగునీరు



ముక్తేశ్వరాలయంలో భక్తుల రద్దీ



తేలప్రోలులో శివకల్యాణం నిర్వహిస్తున్న వింత శ్రీనివాసరెడ్డి, వాణి దంపతులు



చిక్కవరం బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు



ఉయ్యూరు శివాలయంలో భక్తుల రద్దీ



ప్రభకు పూజ చేస్తున్నే భక్తులు

వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. విద్యుద్దీప కాంతులతో ప్రభల ఉత్సవం కనులపండువగా సాగింది. *–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ*







